




విద్యుత్‌శాఖపై బకాయిల భారం

విద్యుత్ బిల్లు చెల్లించడంలో ఒక్కరోజు ఆలస్యమైతే వినియోగదారులకు జరిమానా విధిస్తారు. అదే ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలు కోట్ల రూపాయల బకాయి ఉన్నా విద్యుత్ సంస్థ అపరాధ రుసుము విధించక పోగా, ఉదారంగా వ్యవహరిస్తోంది. దీంతో బకాయిలు పెరుగుతూ వస్తున్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.134.76కోట్ల మేర ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ సంస్థకు బకాయి ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో రూ.66కోట్లు, సూర్యాపేట జిల్లాలో రూ.34.08కోట్లు, యాదాద్రి జిల్లాలో రూ.34.68కోట్ల బకాయిలు ఉన్నాయి.

– నల్లగొండ టౌన్, భువనగిరి టౌన్, భానుపురి

- ప్రభుత్వ కార్యాలయాలవే అత్యధికం
- ఉమ్మడి జిల్లాలో రూ.134.76కోట్లు
- నల్లగొండ జిల్లాలో రూ.66కోట్లు
- యాదాద్రి జిల్లాలో రూ.34.86కోట్లు
- జిల్లాలో రూ.34.08కోట్లు

విద్యుత్ బకాయిలను అరికట్టేందుకు గతంలోనే ప్రీపెయిడ్ మీటర్లను తీసుకువచ్చినా అది అంతగా ఫలితాలు ఇవ్వక పోవడంతో మధ్యలోనే నిలిపివేశారు. నల్లగొండ జిల్లాలో 11,210 ఎల్‌టీ, హెచ్‌టీ ప్రభుత్వ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో వివిధ శాఖల కార్యాలయాలు, తాగునీటి పథకాలు, మునిసిపాలిటీలకు చెందిన కనెక్షన్లు ఉన్నాయి. మితిమీరి బకాయిలు ఉన్న కార్యాలయాలకు మాత్రం విద్యుత్ అధికారులు నోటీలు జారీ చేస్తూ అప్పుడప్పుడు కనెక్షన్ కట్ చేసి తిరిగి పునరుద్ధరిస్తున్నారు. దీంతో బకాయిలు వసూలు కావడం లేదు. తొలగిస్తున్నారు.

యాదాద్రి జిల్లాలో..

యాదాద్రి జిల్లాలో రూ.50.35కోట్ల విద్యుత్ బిల్లులు బకాయిలు ఉండగా, అందులో ప్రభుత్వ శాఖలు చెల్లించాల్సినవి రూ.34.86 కోట్లు. మిగతా రూ.15.49కోట్లను ప్రైవేట్ సంస్థల నుంచి విద్యుత్ సంస్థకు వసూలు కావాల్సి ఉంది. జిల్లాలో అన్ని కేటగిరీలకు చెందిన విద్యుత్ కనెక్షన్లు 4,26,702 ఉన్నాయి. వీటిలో 5,493 ప్రభుత్వ శాఖల కనెక్షన్ల నుంచి రూ.34,86,41,000 బకాయిలు రావాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో బిగించిన 921 ప్రీపెయిడ్ సర్వీసులు అప్‌డేట్‌గా ఉండటంతో బకాయిల భారం కొంత తగ్గింది. అత్యధికంగా 3,540 కనెక్షన్లు ఉన్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ ఏకంగా రూ.27,01,99,000 బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఆ తర్వాతి స్థానంలో జిల్లాలోని ఆరు మునిసిపాలిటీల్లో 531 కనెక్షన్లు ఉండగా, బకాయిలు రూ.6,48,8000 ఉన్నాయి. మూడు కనెక్షన్లు ఉన్న సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్, ఒక కనెక్షన్ ఉన్న మరో ప్రభుత్వ శాఖలో విద్యుత్ బకాయిలే లేకపోవడం విశేషం. విద్యాశాఖలో 335 కనెక్షన్లు ఉండగా రూ.57.04లక్షలు, 67 కనెక్షన్లు ఉన్న పోలీస్ శాఖ రూ.39.76 లక్షలు, 117 కనెక్షన్లు ఉన్న సంక్షేమశాఖ రూ.7.4లక్షలు, 53 కనెక్షన్లు ఉన్న పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ రూ.6.89లక్షలు, 57 కనెక్షన్లు ఉన్న రెవెన్యూశాఖ రూ.4.27లక్షలు, 230 కనెక్షన్లు ఉన్న ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్‌శాఖ రూ.3.34లక్షలు బకాయి పడ్డాయి. మరో నాలుగు శాఖలు రూ.5.95లక్షలు బకాయి ఉండగా, మిగతా 15 ప్రభుత్వ శాఖల 555 కనెక్షన్ల నుంచి రూ.5.23లక్షలు విద్యుత్ శాఖకు రావాల్సి ఉంది.

నల్లగొండ జిల్లాలో ఇలా..

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు మొత్తం రూ.66,19,93,000 విద్యుత్‌శాఖకు చెల్లించాల్సి ఉంది. అందులో అత్యధికంగా గ్రామపంచాయితీలు, మునిసిపాలిటీలవే ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు సంబంధించి 8,048 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, రూ.47.76కోట్లు బకాయి పడ్డాయి. మునిసిపాలిటీలకు సంబంధించి 1,683 కనెక్షన్‌లకు రూ.11.33కోట్ల బకాయిలు ఉన్నాయి. 14 శాఖలకు చెందిన కార్యాలయాలకు సంబంధించి 1,479 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, రూ.7.10కోట్ల మేర విద్యుత్ బిల్లులు బకాయిలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా విద్యాశాఖ రూ.3.46కోట్లు, ఎత్తిపోతల పథకాల బకాయిలు రూ.1.50కోట్లు ఉన్నాయి. పోలీస్ క్వార్టర్స్‌కు సంబంధించి మిర్యాలగూడలో రూ.51.01లక్షలు, నల్లగొండలో రూ.44లక్షలు, దేవరకొండలో రూ.25.22లక్షలు, జిల్లా వైద్యఆరోగ్యశాఖ రూ.43.50లక్షలు, రెవెన్యూశాఖ రూ.20.62లక్షలు బకాయిలు పడ్డాయి. బీసీ వెల్ఫేర్ రూ.1.20లక్షలు, పోలీస్‌శాఖ రూ.7.02లక్షలు, జైళ్ల శాఖ రూ.1.01లక్షలు, సాంఘికసంక్షేమశాఖ రూ.5.47లక్షలు, గిరిజన సంక్షేమశాఖ రూ.3.32లక్షలు, ఏరియా ఆస్పత్రులు రూ.8.51లక్షలు, పశుసంవర్ధశాఖ రూ.1.92లక్షలు విద్యుత్ శాఖకు బకాయిపడ్డాయి.

బకాయిల వసూలుకు చర్యలు

జిల్లాలో పేరుకుపోయిన ప్రభుత్వరంగ సంస్థల బకాయిల వసూలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా అత్యవసర సర్వీసులైన ఆస్పత్రులు, సంక్షేమ వసతిగృహాలకు సంబంధించిన బకాయిలు విషయంలో మానవతా దృక్పథంతో ఆలోచించి మినహాయింపు ఇస్తున్నాం. ఇక గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలకు ఎప్పటికప్పుడు నోటీసులు జారీ చేసి ఆయా శాఖల అధికారులతో మాట్లాడి బిల్లులు కట్టిస్తున్నాం. బిల్లు చెల్లించలేని పక్షంలో విద్యుత్ తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– టీఆర్.చంద్రమోహన్, నల్లగొండ జిల్లా ఎస్‌ఈ

బకాయిలు చెల్లించాలని కోరుతున్నాం



ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించాలని ఎప్పటికప్పుడు కోరుతున్నాం. అందుకు సంస్థ సిబ్బంది క్రమం తప్పకుండా కార్యాలయాలకు వెళ్తుండటంతో పాటు లేఖలు రాస్తున్నారు. అయినప్పటికీ సకాలంలో బిల్లులు వసూలు కావడం లేదు. ప్రభుత్వం గ్రాంట్లు విడుదల చేసినప్పుడే బిల్లులు వసూలవుతున్నాయి. ప్రజావసరాలు, పాలన దృష్ట్యా ప్రభుత్వ సర్వీసుల విషయంలో పట్ల కఠినంగా వ్యవహరించలేకపోతున్నాం.

– ఐ.శ్రీనాథ్, యాదాద్రి జిల్లా ఎస్‌ఈ

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం

ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం.బిల్లులు పెండింగ్ ఉన్న ఆయాశాఖలకు నోటీసులు జారీ చేస్తాం.

– పాల్‌రాజ్, సూర్యాపేట జిల్లా ఎస్‌ఈ

గ్రాంట్ వస్తేనే బిల్లుల చెల్లింపు

ప్రభుత్వం గ్రాంట్లను విడుదల చేస్తేనే సంబంధిత శాఖలు విద్యుత్ బిల్లులను చెల్లించడంతో పాటు కార్యాలయాల నిర్వహణ సులువవుతుంది. కానీ, ప్రభుత్వం గ్రాంట్ల విడుదలలో చేస్తున్న జాప్యంతో పలు ప్రభుత్వ శాఖలు సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించలేకపోతున్నాయి. ఇది ట్రాన్స్‌కోకు గుదిబండగా మారుతోంది. బిల్లుల వసూలు కోసం ట్రాన్స్‌కో అధికారులు సంబంధిత ప్రభుత్వశాఖల కార్యాలయాలకు లేఖలు రాయడం పరిపాటిగా మారింది. అయినా బిల్లులు వసూలు కావడం లేదు.

జిల్లాలో రూ.34.08కోట్లు

జిల్లాలో విద్యుత్ సంస్థకు రూ.34.08కోట్ల బకాయిలు ఉండగా, అందులో గ్రామ పంచాయతీల బిల్లులే అత్యధికంగా ఉన్నాయి. జిల్లాలో 475 పంచాయతీలు రూ.29.98కోట్ల మేర బకాయి పడ్డాయి. చింతలపాలెం మండలంలో రూ.3.57కోట్లు అత్యధికంగా బకాయిలు ఉన్నాయి. ఆ తరువాత మఠంపల్లి మండలంలో రూ.2.52కోట్లు, పెన్‌పహాడ్ మండలంలో రూ.2.15కోట్లు, చిలుకూరు మండలంలో రూ.2.09కోట్లు బకాయిలు ఉన్నాయి. జిల్లాలో ఉన్న ఐదు మునిసిపాలిటీలు విద్యుత్‌శాఖకు రూ.1.89కోట్లు బకాయి పడ్డాయి. సూర్యాపేట మునిసిపాలిటీ రూ.5.19లక్షలు, తిరుమలగిరి రూ.71.61లక్షలు, హుజూర్‌నగర్ రూ.22.17లక్షలు, నేరేడుచర్ల రూ.18.78లక్షలు, కోదాడ రూ.71.92 లక్షలు విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉన్నాయి. ఇక ప్రభుత్వ కార్యాలయాలు రూ.2.31కోట్లు చెల్లించాల్సి ఉంది. వ్యవసాయశాఖ రూ.1.60లక్షలు, పశుసంవర్ధక శాఖ రూ.2.64లక్షలు, విద్యుత్ కార్యాలయాలు రూ.0.66లక్షలు, జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ రూ.2.09లక్షలు, నీటిపారుదలశాఖ రూ.7.02లక్షలు, హెల్త్ అండ్ మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ రూ.58.09లక్షలు చెల్లించాల్సి ఉంది. ఉన్నత విద్యాశాఖ రూ.1.35లక్షలు, గృహనిర్మాణశాఖ రూ.2.52లక్షలు, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ రూ.0.54లక్షలు, పాఠశాల విద్యాశాఖ రూ.1.47కోట్లు, ఆర్‌అండ్‌బీ రూ.3.20లక్షలు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రూ.3.43లక్షలు, యూత్ అడ్వాన్స్‌మెంట్ అండ్ టూరిజంశాఖ రూ.0.28లక్షలు, కేంద్ర ప్రభుత్వ శాఖలు రూ.0.13లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

మారుతున్న రాజకీయ సమీకరణలు

- 23న నేరేడుచర్లలో, 24న హుజూర్‌నగర్‌లో అవిశ్వాస తీర్మాన సమావేశాలు
- 27న సూర్యాపేట, కోదాడ మునిసిపాలిటీల్లో..
- జోరుగా క్యాంపు రాజకీయాలు

రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో రాజకీయ సమీకరణలు కూడా వేగంగా మారుతున్నాయి. పలువురు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, మండల, గ్రామస్థాయి నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు మొగ్గుచూపుతున్నారు. ఎన్నికలకు ముందే హుజూర్‌నగర్ నియోజకవర్గంలో గరిడేపల్లి, హుజూర్‌నగర్ ఎంపీపీలు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో అవిశ్వాస గండం నుంచి వారు తప్పించుకున్నారు.

– (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)/నేరేడుచర్ల, హుజూర్‌నగర్, నడిగూడెం



హుజూర్‌నగర్‌లో కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్‌పై ఈనెల 23వ తేదీన అవిశ్వాస తీర్మాన సమావేశం జరగనుంది. 24న హుజూర్‌నగర్ మునిసిపల్ వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించేందుకు ఇప్పటికే నోటీసులు జారీ అయ్యాయి. 27న సూర్యాపేట, కోదాడ మునిసిపల్ చైర్‌పర్సన్‌లు, వైస్‌చైర్మన్లపై అవిశ్వాస తీర్మాన సమావేశం జరగనుంది. సూర్యాపేటలో మొత్తం 48 మంది కౌన్సిలర్లు కాగా, 47వ వార్డు కౌన్సిలర్ రాజీనామా చేశారు. దీంతో మునిసిపాలిటీలో 47 మంది కౌన్సిలర్లు ఉన్నారు. 31 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఉండగా అవిశ్వాస తీర్మానానికి 16 మంది కౌన్సిలర్లు సంతకాలు చేశారు. వారితోపాటు కాంగ్రెస్ 8, బీజేపీ 4, బీఎస్పీ నలుగురు కౌన్సిలర్లు మద్దతు పలికారు. మొత్తం 32 మంది అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికారు. 16 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు వారం క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లారు. నేరేడుచర్లకు చెందిన కౌన్సిలర్లు శనివారం క్యాంపునకు వెళ్లారు. హుజూర్‌నగర్‌కు కౌన్సిలర్లు ఈనెల 22న క్యాంపునకు వెళ్లే అవకాశం ఉంది.

నేరేడుచర్లలో 15మంది కౌన్సిలర్లు ఉండగా, 13వ వార్డు కౌన్సిలర్ చల్లా శ్రీలతారెడ్డి రాజీనామా చేశారు. చైర్మన్ జయబాబును మినహాయిస్తే 12 మంది కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లారు. 15 వార్డుల్లో ఏడు కాంగ్రెస్, ఏడు బీఆర్‌ఎస్, ఒక స్థానాన్ని సీపీఎం గెలుచుకున్నాయి. కాగా, బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన శ్రీలత రాజీనామాతో బలం ఆరుకు పడిపోయింది. బీఆర్‌ఎస్‌కు చెందిన నలుగురు కాంగ్రెస్‌లో చేరగా, మరో ఇద్దరు బీఆర్‌ఎస్‌లోనే ఉన్నా కాంగ్రెస్‌కు మద్దతు పలికారు. 6వ వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్‌లో చేరతానని ప్రకటించి క్యాంపునకు వెళ్లారు. దీంతో చైర్మన్ జయబాబు ఒక్కరే మిగిలారు.

విప్ చెల్లదని కమిషనర్‌కు వినతి

మునిసిపల్ అవిశ్వాస తీర్మాన నేపథ్యంలో బీఆర్‌ఎస్ విప్ చెల్లదని మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, కౌన్సిలర్లు కోతి సంపత్‌రెడ్డి, అమరబోయిన సతీష్, వీర్లపాటి గాయత్రిభాస్కర్ స్పష్టం చేశారు. శనివారం ఈ మేరకు మునిసిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. బీఆర్‌ఎస్ నుంచి మెజారిటీ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరినందున బీఆర్‌ఎస్ ఫ్లోర్‌ను రద్దుచేసి కాంగ్రెస్‌లో విలీనం చేయాలని వినతిలో కోరారు. ఈ విషయంపై అధికారికంగా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. అదేవిధంగా కలెక్టర్‌కు సైతం లేఖ పంపినట్లు తెలిపారు. వారి వెంట కౌన్సిలర్లు కొమ్ము శ్రీనివాస్, జక్కుల శంభయ్య, ఓరుగంటి నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

● 30న చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం తీర్మాన సమావేశం

నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ అనంతు శ్రీనివాస్‌పై ఈనెల 30న అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సమావేశం నిర్వహించాలని జిల్లా సహకార సంఘం అధికారి శ్రీధర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. సంఘంలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా, ఇటీవల 1వ వార్డు డైరెక్టర్ కొండ పిచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. 10 మంది డైరెక్టర్ ఈనెల 8న చైర్మన్‌పై అవిశ్వాసానికి జిల్లా సహకార సంఘం అధికారికి దరఖాస్తు చేశారు.

నడిగూడెం పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం వాయిదా..

నడిగూడెం పీఏసీఎస్ చైర్మన్ పుట్ట రమేష్‌పై శనివారం ఏర్పాటు చేసిన అవిశ్వాస తీర్మాన సమావేశం వాయిదా పడింది. సహకార ట్రిబ్యునల్ నుంచి చైర్మన్ స్టే తెచ్చుకోవడంతో అవిశ్వాసం వాయిదా పడినట్టు జిల్లా సహకార అధికారి నామ శ్రీధర్ తెలిపారు. తొమ్మిది మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానాన్ని కోరగా, శుక్రవారం సభ్యులందరికీ నోటీలు పంపారు. అయితే చైర్మన్ రమేష్ స్టే తెచ్చుకోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు డీసీవో శ్రీధర్ తెలిపారు. అయితే స్టే విషయంపై సమాచారం ఇవ్వకపోవడంతో సీఈవో ఎలమందరావుపై డైరెక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాములు, డైరెక్టర్లు పద్మ, రమాదేవి, కోటిరెడ్డి, జయమ్మ, కృష్ణప్రసాద్, సుధాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నడిగూడెం పీఏసీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పాలకవర్గ సభ్యులు

కోనోకార్పరస్ మొక్కలను తొలగించాలి

అదనపు కలెక్టర్ ప్రియాంక



పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

మేళ్లచెర్వు, జనవరి 20: పర్యావరణానికి, ప్రకృతికి హానిచేసే కోనోకార్పరస్ మొక్కలను వెంటనే తొలగించాలని అదనపు కలెక్టర్ ప్రియాంక అన్నారు. శనివారం చింతలపాలెం మండలంలో ఆకస్మిక పర్యటన చేశారు. హరితహారంలో భాగంగా నిర్వహిస్తున్న పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. చింతలపాలెం మండల కేంద్రంలోని పల్లె ప్రకృతివనంతోపాటు పులిచింతల ప్రాజెక్టు కాలనీ పల్లె ప్రకృతి వనం, నర్సరీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో నీటికొరత లేకుండా నర్సరీలోనే మొక్కలను సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌వెంట ఎంపీపీ కొత్తమద్ది వెంకటరెడ్డి, తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎంపీడీవో జగదీష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హిందూ ధర్మం విశ్వగురువుగా అవతరించనుంది

- ఆధ్యాత్మిక సేవాభావం ఎంతో అవసరం
- తెలుగు రాష్ట్రాల స్థాయి భక్తిసమ్మేళనం ప్రారంభం



హుజూర్‌నగర్‌లో తెలుగు రాష్ట్రాల స్థాయి భక్తి సమ్మేళనంలో పాల్గొన్న బోధమయనందాజీ, వినిశ్చలానందజీ, తదితరులు

హుజూర్‌నగర్,జనవరి 20: హిందూ ధర్మం విశ్వగురువుగా అవతరించబోతుందని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయనందజీ, విజయవాడ రామకృష్ణ మిషన్ సెక్రటరీ వినిశ్చలానందజీ అన్నారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని టౌన్‌హాల్‌లో రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో భావ ప్రచార పరిషత్ కార్యక్రమంలో భాగంగా రెండురోజుల భక్తి సమ్మేళనాన్ని ప్రారంభించారు. అంతకుముందు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావం ఉండాలన్నారు. ఎదుటి వారికి సహాయపడాలన్న సేవాతత్వం కలిగి ఉండాలన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుతూ హైందవ జీవితాన్ని గడపాలన్నారు. విద్యార్థులు చిన్నతనం నుండే ఆధ్యాత్మిక చింతనవైపు నడవాలన్నారు. విద్యార్థులు, యువతలో నైతిక విలువలు పెంచాలన్నారు. హిందూధర్మంలో అన్నివర్గాలకు ప్రాతినిధ్యం ఉంటుందన్నారు. హిందూ ధార్మిక వ్యవస్థలు నిరంతరం సమాజ ఉన్నతికి కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవాసమితి ప్రతినిధి సుబ్రహ్మణ్యశర్మ, గజ్జి ప్రభాకర్, ఓరుగంటి నాగేశ్వరరావు, నందయ్య, గుండా రమేష్, అనిల్‌కుమార్, శివయ్య, సైదారత్నంగౌడ్, శితికంఠానందజీ, పూజానందజీ, సితేనందజీ, సేవ్యానందజీ, సన్నివాసానందజీ, యజ్ఞపురుషానందజీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రెయిన్ సిమెంట్ విస్తరణకు ఓకే

ప్రశాంతంగా ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

మేళ్లచెర్వు, జనవరి 20: మండల పరిధిలోగల రామాపురం గ్రామంలోని రెయిన్‌సిమెంట్స్, గనుల పరిశ్రమ విస్తరణకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపారు. రామాపురంలోని ఫ్యాక్టరీ ఆవరణలో కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధ్యక్షతన శనివారం ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. మొదటి అంశంగా క్లింకర్ సామర్థ్యం ఒక సంవత్సరానికి ఒక మిలియన్ టన్నుల నుంచి 2.50 మిలియన్ టన్నుల ఉత్పత్తికి గాను, సిమెంట్స్ 1.5 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నుంచి 3.80 మెట్రిక్ టన్నులకు విద్యుత్ కేంద్రం నుంచి 5 మెగావాట్ల నుంచి 12 మెగా వాట్ల అదనపు ఉత్పత్తికి ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఇందులో 15మంది సమావేశంలో తమ అభిప్రాయాలను తెలపగా, 83మంది పర్యావరణ శాఖ కార్యాలయానికి లేఖలు, ఈమెయిల్ రూపంలో పంపగా నలుగురు ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో రాతపూర్వకంగా తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. రెండో అంశంగా 147 హెక్టార్లలో ఉన్న సున్నపురాయి గని ఉత్పత్తి సామర్థ్యం 1.60 మెట్రిక్ టన్నుల నుంచి 3.94 మెట్రిక్ టన్నులకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించగా, 16 మంది సమావేశంలో అభిప్రాయం తెలపగా 77 మంది కార్యాలయానికి లేఖలు, ఈమెయిల్ రూపంలో తెలపగా 12 మంది రాతపూర్వకంగా అభిప్రాయాన్ని తెలిపారు. మూడో అంశంగా రేవూరు గ్రామంలో 55.82 హెక్టార్లలో ఉన్న సున్నపురాయి గని నుంచి నూతనంగా 60వేల టన్నుల సామర్థ్యంతో సున్నపు రాయి ఉత్పత్తికి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించగా, 25 మంది సమావేశంలో అభిప్రాయాలు తెలిపారు. 75 మంది పర్యావరణ శాఖ కార్యాలయానికి లేఖలు, ఈమెయిల్ ద్వారా తెలపగా, 20 మంది సమావేశంలో లేఖల రూపంలో తమ అభిప్రాయాన్ని తెలియపర్చారు.

స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలి

ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న వారిలో అధికంగా స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆస్పత్రిని ఆధునికీకరించాలని, వాటితోపాటు స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటాం

ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని కంపెనీ ప్రతినిధి జీవీకే ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ తరఫున ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు 2వేల మంది విద్యార్థులకు సీబీయస్ సిలబస్‌తో నూతనంగా పాఠశాల భవనం ఏర్పాటుచేస్తామన్నారు. గ్రామానికి కల్యాణ మండపం నిర్మిస్తామని, సీఎస్‌ఆర్ ద్వారా అన్ని గ్రామాలకు విడతలవారీగా రోడ్లు నిర్మిస్తామన్నారు. ఆస్పత్రిలో సేవలు పెంచుతామని, నూతనంగా ఏర్పడే ప్లాంటు ద్వారా 300 కొత్త ఉద్యోగావకాశాలు ఉన్నాయని, స్థానిక యువతకు 70 శాతం కేటాయిస్తామన్నారు.

పర్యావరణ క్లియరెన్స్‌కు నివేదిస్తాం : కలెక్టర్

ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన ఫిర్యాదులు, అభిప్రాయాలను కేంద్ర పర్యావరణ శాఖ క్లియరెన్స్‌కు నివేదిస్తామని కలెక్టర్ వెంకట్రావ్ తెలిపారు. మూడు విడతలుగా నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు, పర్యావరణవేత్తలు మద్దతు తెలపడం హర్షనీయమని, సీఎస్‌ఆర్ నిధుల నుంచి హుజూర్‌నగర్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రజాభిసేకరణలో వచ్చిన ఫిర్యాదులు పరిష్కరించాలని కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా పర్యావరణ శాఖ ఈఈ సురేష్‌బాబు, జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక, హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ జ్యోతి, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ ప్రకాష్, సీఐ రామకృష్ణారెడ్డి, ఎంపీపీ కొట్టె పద్మ, సర్పంచ్ మల్లికార్జున్‌రావు, మాజీ ఎంపీపీ పాలేటి రామారావు, మాజీ సర్పంచ్‌లు, సైదేశ్వరరావు, బసవయ్య, ఎన్జీవోలతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరానికి ప్రత్యేక బస్సు

కోదాడ డిపో మేనేజర్ శ్రీహర్ష

కోదాడ రూరల్, జనవరి 20: కోదాడ డిపో నుంచి తమిళనాడులోని అరుణాచలేశ్వరుని గిరి ప్రదర్శన చేయాలనుకునే భక్తుల సౌకర్యార్థం ప్రతీ పౌర్ణమికి బస్సు ఏర్పాటు చేయనున్నట్లు డిపో మేనేజర్ శ్రీహర్ష శనివారం తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 24వ తేదీ బుధవారం ఉదయం 6 గంటలకు కోదాడ డిపో నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. ఈ బస్సు కాణిపాకం, అరుణాచలం వెళ్లి తిరుగు ప్రయాణంలో వేలూరు గోల్డెన్ టెంపుల్‌కు, అనంతరం ఈ నెల 26వ తేదీ ఉదయం స్థానిక డిపోకు చేరుకుంటుందన్నారు. చార్జి ఒక్కొక్కరికి రూ.3,500గా నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు సెల్: 7382833498, 9573953143 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

మాడ్గులపల్లి, జనవరి 20 : నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో ఇరువర్గాల ఘర్షణకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గజలాపురం గ్రామానికి చెందిన జక్క నాగయ్య పదేళ్ల కిందట ముద్ద మహేష్ కుటుంబసభ్యులకు రూ.12వేలు అప్పుఇచ్చారు. ఈ విషయంపై ఇద్దరి మధ్య కొంతకాలంగా ఘర్షణ జరుగుతోంది. అందులో భాగంగానే శనివారం గ్రామంలో ముద్ద మహేష్, నాగయ్యల మధ్య గొడవ జరగడంతో నాగయ్యకు గాయాలయ్యాయి. బాధితుడు నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

అతి చిన్నసైజులో
రాములోరి పాదుకల తయారీ

నార్కట్‌పల్లి, జనవరి 20: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన స్వర్ణకారుడు చొల్లేటి శ్రీనివాసచారి అతిచిన్న రాములోరి పాదుకలను తయారు చేశారు. అయోధ్యలో చరిత్రలో నిలిచిపోయేలా ఈ నెల 22న జరిగే బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ, రామ మందిర ప్రారంభోత్సవ పుణ్యకార్యాన్ని పురస్కరించుకుని తయారు చేసినట్లు తెలిపారు. రెండు పాదుకలను కేవలం 0.130 మిల్లీ గ్రాముల బంగారాన్ని వినియోగించి 8 మిల్లీ మీటర్ సైజు పొడవు, 4మిల్లీమీటరు సైజు వెడల్పుతో తయారు చేసినట్లు తెలిపారు. వీటిని తయారు చేయడానికి కేవలం గంట మాత్రమే సమయం పట్టిందని తెలిపాడు. కాగా గతంలో కూడా బతుకమ్మ, రాకెట్ నమూనా, జాతీయ పతాకం, శివలింగం, భారతదేశ పటం వంటి వాటిని అతి చిన్నసైజు పరిమాణంలో తయారు చేసి పలువురి మన్ననలు పొందాడు.





రాములోరి అతిచిన్న పాదుకలు, తయారు చేసిన స్వర్ణకారుడు శ్రీనివాసచారి

బ్రెయిన్‌డెడ్‌తో వ్యక్తి మృతి

అవయవదానం చేసిన కుటుంబసభ్యులు



దుర్గయ్య(ఫైల్)

శాలిగౌరారం, జనవరి 20: అవయవదానంతో స్ఫూర్తిగా నిలిచారు నల్లగొండ జిల్లా శాలిగౌరారం ఇటుకలపహాడ్ గ్రామానికి చెందిన అల్లి దుర్గయ్య కుటుంబ సభ్యులు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారం మండలం ఇటుకలపహాడ్ గ్రామానికి చెందిన అల్లి దుర్గయ్య(53) ఈ నెల 16న బాత్‌రూమ్‌లో ప్రమాదవశాత్తు కింద పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించేలోగా బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న జీవన్‌దాన్ ఫౌండేషన్ దుర్గయ్య కుటుంబ సభ్యులను సంప్రదించింది. దీంతో వారి అంగీకారం మేరకు దుర్గయ్య లివర్, రెండు కళ్లను సేకరించారు. దుర్గయ్య చనిపోయిన మరో ఇద్దరికి చూపును ఇవ్వబోతున్నట్లు వైద్యులు తెలిపారు. దుర్గయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. దుర్గయ్య అవయవదానాలకు అంగీకరించిన కుటుంబ సభ్యులను సర్పంచ్ అల్లి సైదులుతో పాటు గ్రామస్థులు అభినందించారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేయాలి



కనగల్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి

కనగల్, జనవరి 20 : ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలుచేయాలని నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కనగల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులతో పాటు వివిధ విభాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితులకు న్యాయం చేస్తామన్న భరోసా కల్పించాలని సూచించారు. అంతకు ముందు పోలీస్‌స్టేషన్ ఆవరణలో పరేడ్‌ను నిర్వహించారు. ఆయన వెంట చండూరు సీఐ ఏ వెంకటయ్య, ఎస్ఐ బీ రామకృష్ణయ్యగౌడ్, ఏఎస్ఐ సర్ఫరాజ్‌ఖాన్, సిబ్బంది ఉన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానా, జైలు

నల్లగొండ టౌన్, జనవరి 20 : మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పదని నల్లగొండ ట్రాఫిక్ సీఐ బీ డానియల్ కుమార్ హెచ్చరించారు. శనివారం మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 34మందిని జేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. వీరిలో ఒకరికి 5 రోజులు, ఒకరికి 2, నలుగురికి ఒక రోజు జైలు, మిగిలిన 28 మందికి రూ.30వేల జరిమానా విధించారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించడంతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐతో పాటు, ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

ప్రాణాలు తీసిన అతివేగం

పాలకవీడు, జనవరి 20 : సూర్యాపేట జిల్లా పాలకవీడులో అతివేగంతో లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన పాపగంటి దేవదానం(50) శనివారం ప్రధానరహదారి మూలమలుపు నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. జాన్‌పహాడ్ నుంచి నేరేడుచర్ల వైపు వస్తున్న టీఎస్28టీ 0459 నెంబరు గల అతివేగంతో వచ్చిన ట్యాంకర్ లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ అజాగ్రత్తగా కారణంగానే దేవదానం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. దేవదానంకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య పరిమళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లింగయ్య తెలిపారు.

లారీ ట్యాంకర్ ఢీకొని యువకుడికి గాయాలు

రామన్నపేట, జనవరి 20 : యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో కంటైనర్ ఢీకొనడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం రాజన్నగూడెం గ్రామానికి చెందిన పరమేష్ బైక్‌పై రామన్నపేట నుంచి నల్లగొండ వైపు వెళ్తుండగా సబ్‌స్టేషన్ ఎదురుగా చిట్యాల నుంచి వస్తున్న కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో రామన్నపేట ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నల్లగొండకు తరలించారు.

బత్తాయి చెట్లను నరికిన గుర్తుతెలియని వ్యక్తులు

పెద్దవూర, జనవరి 20 : నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని ఊట్లపల్లిలో 170 బత్తాయి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. బాధితుడు మల్లయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఊట్లపల్లిలోని సర్వే నెంబరు 291లో రెండేళ్ల కిందట మల్లయ్య 230 బత్తాయి మొక్కలు నాటాడు. అయితే ఇదే సర్వే నెంబరులోని భూమి విషయంలో బూతరాజు సాయన్నతో వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి 170 మొక్కలను నరికివేశారని బాధిత రైతు మల్లయ్య తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అనుమానితులపై ఫిర్యాదు చేసినట్లు రైతు మల్లయ్య తెలిపారు. తనకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

ఆటో దొంగ అరెస్ట్

కొండమల్లేపల్లి, జనవరి 20 : ఆటో దొంగతనం చేసిన కొప్పుల మహేశ్ అలియాస్ సాయి అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండమల్లేపల్లిలో నివాసముంటున్న ముడావత్ సుక్య ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 16న రోజు మాదిరిగానే తన ఇంటి ఎదుట ఆటోను నిలిపాడు. తెల్లవారుజామున లేచి చూసే సరికి ఆటో లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం మండలంలోని కోల్‌ముంతలపహాడ్ స్టేజీ వద్ద తనిఖీ చేస్తుండగా నిందితుడు ఆటోతో సహా పట్టుబడినట్లు తెలిపారు. ఆటోను స్టేషన్‌కు తరలించి నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్ఐ వీరబాబు, సిబ్బంది హేమూనాయక్, వెంకటేశ్‌లను సీఐ అభినందించారు.

రూ.22,900విలువైన మద్యం పట్టివేత

కొండమల్లేపల్లి : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం బైపాస్ వద్ద కొండ్రరెడ్డి రమేశ్ అనే వ్యక్తి అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న బెల్టు దుకాణంపై ఓ వ్యక్తి ఫిర్యాదుతో దాడి చేసినట్లు తెలిపారు. దాడుల్లో రూ.22,900 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

కోదాడ రూరల్, జనవరి 20 : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ జిల్లాలోని హనుమాన్ జంక్షన్ నుంచి రెండు డీసీఎంలలో 85 ఆవులను తరలిస్తూ అదేసమయంలో పోలీసుల వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డట్లు ఆయన తెలిపారు. రెండు డీసీఎంలను స్వాధీనం చేసుకుని పశువులను తరలిస్తున్న బాణోతు రమేష్, కుర్రా సునీల్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పశువులను గోశాలకు తరలించామన్నారు.

మిగతా సేవలు ఎప్పుడో?



భువనగిరి జిల్లా ఆసుపత్రిలోని తెలంగాణ డయాగ్నోస్టిక్స్

వైద్య పరీక్షల పేరుతో దోపిడీకి గురవుతున్న పేదలకు ఉపశమనం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం డయగ్నోస్టిక్ కేంద్రాలను ప్రారంభించింది. అయితే యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఈ పరీక్షల కేంద్రాన్ని ప్రారంభించి ఏడు నెలలు గడుస్తున్నా నేటికీ సగం సేవలే అందుబాటులోకి వచ్చాయి. దీంతో మిగతా రోగ నిర్ధారణ పరీక్షల కోసం ప్రైవేట్ లేదా హైదరాబాద్‌లోని ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. 2023 జూలై 1న ప్రారంభమైన తెలంగాణ డయగ్నోస్టిక్స్‌లో డిసెంబరు 31 వరకు 20,367 మందికి 63,078 రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

- భువనగిరి టౌన్

» తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రం ఏర్పాటు చేసి ఏడు నెలలు
» 20,367 మందికి 63,078 రోగ నిర్ధారణ పరీక్షలు
» 134 సేవలకు 74 మాత్రమే అందుబాటులోకి
» ఖాళీ పోస్టులతో సేవలకు అంతరాయం

భువనగిరి జిల్లా ఆసుపత్రిలోని తెలంగాణ డయాగ్నోస్టిక్స్‌లో 134 రోగ నిర్ధారణ పరీక్షల సేవలు ప్రజలకు అందాల్సి ఉంటుంది. కానీ నేటి వరకు కేవలం 74 పరీక్షలు మాత్రమే అందుబాటులో వచ్చాయి. వీటిలో అత్యధికంగా పరీక్షలు చేయించే 74 పరీక్షలు అందుబాటులోకి రావడం కాస్త శుభపరిణామం. మిగతా 60 పరీక్షలు కూడా దశల వారీగా అందుబాటులోకి వస్తాయని అధికారులు అంటున్నారు. కానీ అత్యధిక బిల్లు వేసే సిటీ స్కాన్, ఎంఆర్ఐ, టూడీ ఈకో తదితర పరీక్షలు అందుబాటులోకి వస్తే ప్రజలకు మరింత ఉపశమనం లభించనుంది. కాగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.6వేల నుంచి రూ.10వేల వరకు ప్యాకేజీల రూపకంలో ప్రైవేట్ ల్యాబ్‌లు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిర్వహించే విటమిన్ డీ, సీబీఎఫ్, థైరాయిడ్, కిడ్నీ, లివర్, షుగర్, డెంగ్యూ, కామెర్లు, కలరా తదితర రోగ నిర్ధారణ పరీక్షలు డయాగ్నోస్టిక్స్‌లో ఉచితంగా లభిస్తున్నాయి. మహిళల ప్రసవానికి ముందు నిర్వహించే ఏఎన్ సీ ప్రొఫైల్ పరీక్షలు, అల్ట్రా సౌండ్ స్కానింగ్, మమోగ్రఫీ, క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు, డిజిటల్ ఎక్స్‌రే, ఈసీజీ, తదితర సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే రోగులు నేరుగా పరీక్షల కోసం డయాగ్నోస్టిక్స్‌కు వెళ్లే అవకాశం లేదు. ఏదేని ప్రభుత్వ ఆసుపత్రి, పీహెచ్‌సీలలో సేకరించిన శాంపిల్స్‌ను మాత్రమే డయాగ్నోస్టిక్స్‌లో పరీక్షించి సుమారు 8, 9 గంటల్లో ఆన్‌లైన్‌లో రిపోర్టులు ఇస్తున్నారు. మరిన్ని సందర్భాల్లో ప్రభుత్వ వైద్యుల రిఫరెన్స్‌తో రోగులకు నేరుగా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఇప్పటివరకు 20,367 మందికి పరీక్షలు

జిల్లా ఆసుపత్రిలో డయాగ్నోస్టిక్స్ సేవలు అందుబాటులోకి వచ్చిన 7నెలలుగా జిల్లాలోని 24 పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రులకు సంబంధించి 20,367 మందికి రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 63,078 పరీక్షలు నిర్వహించారు. ఆయా పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను నాలుగు వాహనాల ద్వారా భువనగిరి జిల్లా ఆసుపత్రిలోని తెలంగాణ డయాగ్నోస్టిక్స్ హబ్స్‌కు తరలిస్తున్నారు. పరీక్ష నిర్వహించిన అనంతరం రిపోర్టులను పీహెచ్‌సీలు, రోగుల ఈమెయిల్‌కు అప్‌లోడ్ చేస్తారు. దీంతో ఇంటి వద్దనే రోగ నిర్ధారణ పరీక్షల రిపోర్టులను 8, 9 గంటల లోపు పొందవచ్చును.

డయాగ్నోస్టిక్స్‌తో కచ్చితత్వ రిపోర్టులు



తెలంగాణ డయగ్నోస్టిక్స్‌లో నిర్వహించే రోగ నిర్ధారణ పరీక్షలకు కచ్చితత్వంతో కూడిన రిపోర్టులు ఉండడం ప్రత్యేకత. ఉచితంగా అందుతున్న సేవలతో ప్రజలకు ప్రైవేట్ ల్యాబ్‌ల ఆర్థిక దోపిడి నుంచి విముక్తి లభిస్తోంది. మిగతా సేవలు దశల వారీగా అందుబాటులోకి వస్తాయి. ఖాళీల భర్తీకి నిరంతరం నోటిఫికేషన్లు ఇస్తున్నాం. ఆ పోస్టులు భర్తీ అయితే మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయి.

- డాక్టర్ చిన్నా నాయక్, సూపరింటెండెంట్

ఆలస్యానికి కారణాలివే..

రోగ నిర్ధారణకు సంబంధించి 134 పరీక్షలను ఉచితంగా నిర్వహించే లక్ష్యంతో ఏర్పాటుచేసిన తెలంగాణ గయాడ్నోస్టిక్ హబ్‌లో కేవలం 74 సేవలు మాత్రమే అందుబాటులోకి రాగా మిగతా 60 సేవల కోసం నిరీక్షించడానికి పలు కారణాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఏడు నెలల కిందటే డయాగ్నోస్టిక్స్ ఏర్పాటు జరిగిందని దశల వారీగా మిగతా సేవలు కూడా అందుబాటులోకి వస్తాయంటున్నారు. అయితే గుండె జబ్బులు పెరిగిపోతున్న నేపథ్యంలో టూడీ ఈవో తదితర పరీక్షలు తప్పనిసరి అయ్యాయి. అందుకు సంబంధించిన ల్యాబ్ సామాగ్రి డయాగ్నోస్టిక్స్‌లో అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని వినియోగించే అర్హులైన డాక్టర్లు లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఆ పరీక్షలు నిర్వహించే డాక్టర్ల నియామకాలకోసం అధికారులు పలు మార్లు నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ప్రభుత్వం ఇచ్చే వేతనానికి వైద్యులు సుముఖత చూపకపోవడంతో ఆపోస్టులు ఖాళీగానే ఉంటూ రోగులకు సేవలు అందని పరిస్థితి నెలకొంది. మరికొన్ని నిర్ధారణ పరీక్షల కోసం యంత్రాలు సమకూరినా అందుకు అవసరమైన రసాయనాల సరఫరా లేకపోతుండటం, పూర్తిస్థాయి ల్యాబ్ టెక్నిషియన్ల నియామకాలు లేకపోవడం కూడా ఇబ్బందిగా మారింది.

లక్ష్మీనృసింహుడికి ఘనంగా నిత్యవిధి కైంకర్యాలు



గుట్టలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

యాదగిరిగుట్ట, జనవరి 20: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శనివారం నిత్యవిధి కైంకర్యాలు ఆగమశాస్త్రరీతిలో ఘనంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం, బిందెతీర్థంతో నిత్యారాధనలు ఆరంభించిన ఆచార్యులు రాత్రి వేళ శయనోత్సవ పర్వాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. గర్భాలయంలోని స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠా అలంకార కవచమూర్తులను వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్యతిరుకల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తుల చెంత సువర్ణ పుష్పార్చనలు, అష్టోత్తర పూజల్లో భక్తులు కుటుంబసమేతంగా పాల్గొని మొక్కు చెల్లించుకున్నారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవోత్సవం, సహస్రనామార్చనలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరుడికి, మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.27,69,587 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

స్వామి సేవలో సీఎంవో సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి

యాదగిరీశుడిని ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ముఖమండపంలో ఉత్సవమూర్తుల చెంత సువర్ణపుష్పార్చన పూజల్లో ఆయన పాల్గొన్నారు. పూజల అనంతరం అర్చకులు ఆయనకు ప్రాకార మండపంలో ఆశీర్వచనం చేశారు. దేవస్థాన అధికారులు స్వామివారి అభిషేక లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

మట్టపల్లిలో శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

మఠంపల్లి : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిలోని లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నిత్యకల్యాణాన్ని శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనంతో పాటు ఇతర పూజాక్రతువులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

లక్ష్మీనృసింహస్వామిసన్నిధిలో తలనీలాలు సేకరించుకునే హక్కు కోసం ఆదివారం క్షేత్రంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్‌లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.4 లక్షలు స్వామి వారి పేరున డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. ఈ నెల 25వ తేదీ నుంచి 2025 జనవరి 25 వరకు వేలం కాలపరిమితి ఉంటుందన్నారు.

ముగిసిన శాకాహార జంతు గణన

చందంపేట, జనవరి 20 : నల్లమల అటవీ ప్రాంతంలో మూడు రోజులుగా కొనసాగిన శాకాహార జంతు గణన శనివారంతో ముగిసినట్లు నల్లగొండ జిల్లా డీఎఫ్ఓ సర్వేశ్వర్ తెలిపారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ ప్రాంతం నల్లమల అటవీ ప్రాంతంలో అటవీ అధికారులు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. దీని కారణంగా జంతువుల సంఖ్య భారీగా పెరిగిందన్నారు. చందంపేట మండలం చిత్రియాల, పెద్దమూల, బచ్చాపురం, పాలపేడ ప్రాంతాల్లో మూడు రోజులుగా అటవీ జంతు గణన చేపట్టినట్లు తెలిపారు. మనుబోతులు, దుప్పి, జింకలు, ఆడవికుక్కలు, అడవిపందులు, కృష్ణజింక, ఎలుగుబంటులు, చిరుత పులుల సంఖ్య పెరిగినట్లు ఆయన తెలిపారు. పూర్తి వివరాలు గణంకాలతో సహా ఈ నెల 22న వెల్లడిస్తామని అటవీ అధికారులు తెలిపారు.

జపాన్, జర్మనీల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి అర్బన్, జనవరి 20: కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖల కింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ టామ్కామ్(ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్) జపాన్, జర్మనీల్లో నర్సింగ్ ఉద్యోగఅవకాశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి పి.సాహితి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22 నుంచి 30ఏళ్ల వయస్సు గల బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం డిప్లొమా పూర్తిచేసిన వారు జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి రూ.1.5, రూ.1.8లక్షల వేతనం అందనుందని పేర్కొన్నారు. జర్మనీలో నర్సింగ్ అప్రెంటీస్ ప్రోగ్రాం కోసం 18 నుంచి 28 ఏళ్ల అభ్యర్థులు ఇంటర్మీడియట్‌లో 60శాతం, అంతకంటే అధిక మార్కుల అభ్యర్థులు అర్హులన్నారు. జర్మనీలో ప్లేస్‌మెంట్ శిక్షణ సమయంలో నెలకు ఐఎన్ఆర్ రూ.లక్ష ఉపకారం వేతనం, ఉద్యోగ నియామకం తర్వాత నెలకు రూ.3లక్షలు వేతనం అందుతుందన్నారు. జర్మన్, జపాన్ భాషలపై రెసిడెన్షియల్ శిక్షణ, ఆయా దేశాల్లో పనిచేసేందుకు అవసరమైన అదనపు వృత్తిపరమైన నైపుణ్యాలను అభ్యర్థులకు హైదరాబాద్‌లో అందిస్తామన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాను ఈ నెల 27లోపు జీ మెయిల్ ద్వారా 8919047600, 9573945684, 6302292450 ఈ నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

ఉమ్మడి జిల్లాలో ఇద్దరు యువకుల బలవన్మరణం



విజయ్‌కుమార్(ఫైల్)

కోదాడ రూరల్, జనవరి 20 : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో తండ్రి మందలించాడని కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దొరకుంట గ్రామానికి చెందిన పల్లా విజయ్‌కుమార్(19) కోదాడలోని అనురాగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల విజయ్‌కుమార్ తండ్రికి తెలియకుండా స్నేహితుడికి రూ.10వేలు అప్పు ఇచ్చాడు. విషయం తెలుసుకున్న తండ్రి కుమారుడిని మందలించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. తండ్రి నర్సింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.



మహేష్(ఫైల్)

తిప్పర్తి: నల్లగొండ జిల్లా తిప్పర్తిలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం చెన్నాయిగూడెంలో చోటుచేసుకోగా స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బైరగోని జానయ్య కుమారుడు మహేష్(26) డిగ్రీ పూర్తి చేసి ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో సేల్స్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ నల్లగొండ పట్టణంలో తన మిత్రుడితో కలిసి రూమ్‌లో ఉంటున్నాడు. ఈ నెల 17న రూమ్‌లో క్రిమిసంహారక మందు తాగినట్లు మిత్రుడికి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే మిత్రుడి ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి వెళ్లి చికిత్స నిమిత్తం నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. మహేష్ మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది.

నెట్‌వర్క్ లేక నిలిచిన బ్యాంక్ సేవలు

శాలిగౌరారం, జనవరి 20 : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో శనివారం సేవలు నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. నెట్‌వర్క్ రావడం లేదని బ్యాంక్ అధికారులు బ్యాంక్ ప్రధాన గేట్ ముందు బోర్డుపెట్టారు. నెట్‌వర్క్ లేక, ఖాతాదారులకు సేవలు నిలిపివేయడం జరిగింది అని బోర్డు పెట్టడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వినియోగదారులు నిరాశతో వెనక్కి వెళ్లారు.

నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు సీజ్

హాలియా, జనవరి 20 : నల్లగొండ జిల్లా హాలియాలో శనివారం నెంబరు ప్లేట్స్‌లోని వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ గాంధీనాయక్ తెలిపారు. మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి ఆదేశాల మేరకు హాలియా సీఐ గాంధీనాయక్ ఆధ్వర్యంలో హాలియా సర్కిల్ పరిధిలో నెంబర్ ప్లేట్లు లేని 15 మోటార్ సైకిళ్లను స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సీజ్ చేశారు. ఈసందర్భంగా సీఐ గాంధీనాయక్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు నెంబర్ ప్లేట్లు వేయించుకోవాలన్నారు. సీజ్ చేసిన వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్పెషల్ డ్రైవ్‌లో హాలియా ఎస్ఐ శోభన్‌బాబు, నిడమనూరు ఎస్.ఐ. గోపాల్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు 73.11 శాతం హాజరు



పెద్దవూరలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు, పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దవూర / కొండమల్లేపల్లి / కోదాడ టౌన్ / తుంగతుర్తి, జనవరి 20 : నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తి క్యాంప్ నవోదయ విద్యాలయం ప్రవేశ పరీక్షలు శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసిందని పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణం తెలిపారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించారు. మొత్తం 25 పరీక్షా కేంద్రాల్లో 4,623 మంది విద్యార్థులకు 3,380(73.11శాతం) మంది పరీక్షకు హాజరు కాగా 1243(26.89శాతం) మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో జిల్లా ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు పరిశీలించి, ఏర్పాట్ల గురించి పరీక్ష కేంద్రం చీఫ్ చేరిపల్లి శ్రీనివాస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. 85 మంది విద్యార్థులకు 66 మంది పరీక్షకు హాజరైనట్లు ఎగ్జామ్ చీఫ్ శ్రీనివాస్ తెలిపారు. అనంతరం చిన్నఅడిశర్లపల్లిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సముద్రాల శ్రీనివాస్ తదితరులున్నారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని సీసీరెడ్డి పాఠశాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో నిర్వహించినట్లు ఎంఈవో సలీం షరీఫ్ తెలిపారు. బాలికల ఉన్నత పాఠశాలల్లో 201 మంది విద్యార్థులకు 37 మంది గైర్హాజరు కాగా 164 మంది హాజరయ్యారు. అలాగే సెయింట్ జోసెఫ్ సీసీరెడ్డి పాఠశాలలో 216 మంది విద్యార్థులకు 36 మంది గైర్హాజరు కాగా 180 మంది హాజరయ్యారని ఎంఈవో తెలిపారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో పరీక్ష నిర్వహించారు. 208 మంది విద్యార్థులకు 172 మంది హాజరయ్యారని ఎంఈవో లింగయ్య తెలిపారు.

కొండమల్లేపల్లి రైతువేదిక వద్ద వెలిసిన గుడిసెలు



రైతువేదిక స్థలంలో సర్వే చేస్తున్న అధికారులు

కొండమల్లేపల్లి, జనవరి 20 : రైతులందరూ ఒకే చోట కూర్చొని సలహాలు, సూచనలు, సందేహాలు నివృతి చేసుకోవడానికి గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని పచ్చర్లబావి సమీపంలో సర్వే నెంబరు 170లోని 20 గుంటల స్థలాన్ని కేటాయించి అందులో రైతు వేదికను నిర్మించారు. ఇదిలా ఉండగా మండల కేంద్రానికి చెందిన కొంతమంది రైతువేదిక స్థలాన్ని ఆక్రమించి నాలుగు రోజుల కిందట గుడిసెలు ఏర్పాటుచేశారు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందని ఏవో వెంకన్న దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయన గుడిసెలు వేసుకున్న ప్రాంతాన్ని పరిశీలించారు. సర్పంచ్, గ్రామకార్యదర్శి సలహా మేరకు గుడిసెలు వేసినట్లు వారు చెప్పారని ఏవో తెలిపారు. అయితే గుడిసెలు వేసిన వ్యక్తులతో ఖాళీ చేయిస్తానని సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్ తెలిపినట్లు ఏవో తెలిపారు. ఇదిలా ఉండగా రైతువేదిక స్థలం ఆక్రమణ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏవో చేశారు. అదేవిధంగా ఏవో సూచన మేరకు తహసీల్దార్ దివ్యారెడ్డి ఆదేశాలతో ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి సర్వేయర్‌తో సర్వే చేయించి హద్దురాళ్లను గుర్తించారు. ఎవరైనా రైతువేదిక స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే చర్యలు తీసుకుంటామని ఏవో వెంకన్న తెలిపారు.

కల్తీ గడ్డి మందు పిచికారీతో ఎండిన వరిపొలం

సూర్యాపేటరూరల్, జనవరి 20 : కల్తీ గడ్డి మందు పిచికారీ చేయడంతో వరి పొలం ఎండిపోయింది. సూర్యాపేట జిల్లా కేంద్రం పరిధిలోని రాయినిగూడెం ఆవాసప్రాంతమైన రుపాలగూడెంలో శనివారం చోటుచేసుకుంది. బాధిత రైతు కొణతం కర్ణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తనకున్న 6 ఎకరాల పొలంతో పాటు మరో 6 ఎకరాలు కౌలు తీసుకుని వరి పంటను సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో కలుపు ఎక్కువగా ఉందని హుజూర్‌నగర్ నుంచి ఒక మిత్రుని సలహాతో గడ్డి మందును హుజూర్‌నగర్‌లోని ఓ మందుల దుకాణంలో కొనుగోలు చేసి 10 రోజుల క్రితం పిచికారీ చేశాడు. ఆ తర్వాత పొలం ఎండిపోయింది. రోజురోజుకు వరి మొక్క కుళ్లిపోతుండటంతో శనివారం వ్యవసాయాధికారులకు సమాచారం ఇచ్చాడు. సుమారు రూ.8 లక్షల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఏవో మహ్మద్ జానిమీయా ఎండిపోయిన పొలాన్ని పరిశీలించారు. ప్రాథమిక విచారణ చేపట్టి రైతుకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని మందుల కంపెనీలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎడ్ల వీరమల్లుయాదవ్, ముత్యాల సైదులు, ముత్యాల పిచ్చయ్య, రైతులు పాల్గొన్నారు.

సాగులో మెళకువలు పాటించాలి

చిట్యాల రూరల్ : వరి పంట మూడు రకాల కారణాలతో ఎండిపోతుందని, సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఇబ్బందులు ఉండవని నల్లగొండ జిల్లా చిట్యాల ఏవో పగిడిమర్రి గిరిబాబు అన్నారు. మండలంలోని పెద్దకాపర్తి, చిన్నకాపర్తి గ్రామాల్లో శనివారం ఏఈఓలు కృష్ణకుమారి, మోపిన్‌లతో కలిసి పలువురి రైతులకు సంబంధించిన వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వరిపంటలు ఎండుతున్నాయని రైతులు ఎలాంటి దిగులు చెందవద్దని సరైన సమయంలో చేలకు అవసరమైన చర్యలను తీసుకుంటే నష్టనివారణ చేపట్టవచ్చన్నారు.

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి



వినతిప్రతం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 20: జిల్లాకేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులకు కేటాయించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంక టేశ్వర్లు డిమాండ్‌చేశారు. పార్టీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం డ్రా పద్ధతిలో చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్లను కౌన్సిలర్ తనకు నచ్చినవారిని ఎంపిక చేశారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి నిజమైన లబ్ధిదారులను గుర్తించి కేటాయించాలని కోరారు. ఎంపికైన లబ్ధిదారులకు గత ప్రభుత్వం పట్టాలు ఇచ్చినా, వారికి ఇళ్లు కేటాయించలేదన్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులను తీసివేసేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు ఎక్సైజ్ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, లక్ష్మయ్య, ప్రభాకర్, లింగయ్య ఉన్నారు.

'కుల, మతాల పేరుతో రాజకీయం సరికాదు'

సూర్యాపేటటౌన్, జనవరి 20: రాముడి పేరుతో రాజకీయం చేస్తూ కుల, మతాలను ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం దేశ ఐక్యతను దెబ్బతీస్తోందని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్నికలు వచ్చే ముందు ఏదోవిధంగా మతం పేరుతో, దేశభక్తి పేరుతో ప్రజల్ని రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఎన్నికలు వస్తున్నాయని పూర్తికాని రాముడి గుడిలో రాముడి విగ్రహాన్ని స్థాపించడం తెరపైకి తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, భూక్యా రాంజీ, సయ్యద్, రమేష్, చంద్రకళ, రేణుక, లింగయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో తేజ విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

కోదాడ రూరల్, జనవరి 20: రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో మండలంలోని కొమరబండ తేజ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సారథ్యంలో గ్రే క్యాప్స్ క్విజ్ సంస్థ శనివారం హైదరాబాద్ కింగ్ కోఠిలోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో ఆస్పిరేషన్స్ క్విజ్-2024 నిర్వహించారని పాఠశాల ప్రిన్సిపాల్ రమా సోమిరెడ్డి తెలిపారు. 5 నుంచి 8వ తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో 90 పాఠశాలల నుంచి 180మంది పాల్గొన్నారని, పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు దేవరపల్లి సునందు వర్ధన్‌రెడ్డి, నోముల సృజన్ గుప్తలు 425పాయింట్లతో విజేతలుగా నిలిచారని తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ రీజినల్ బిజినెస్ హెడ్ సిద్ధార్థ చటర్జీ రూ.50 వేల చెక్కుతోపాటు సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారని తెలిపారు.

సినిమాల్లో వివాదాస్పద పేర్లు, పాటలను తొలగించాలి

మఠంపల్లి, జనవరి 20: సినిమాల్లో వివాదాస్పద పేర్లు, పాటలను తొలగించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. చందర్ డిమాండ్ చేశారు. మఠంపల్లిలో శనివారం జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. ఇటీవల విడుదలైన గుంటూరు కారం సినిమాలో విలన్లకు వాడిన వివాదాస్పద పేర్లు, అసభ్యకరమైన పాటలను తొలగించాలన్నారు. విప్లవ ఉద్యమ నాయకులు కారల్ మార్క్స్, లెనిన్ పేర్లను గుంటూరు కారం సినిమాల్లో విలన్ల పా త్రలకు పెట్టడం విచారకరమన్నారు. మడత కుర్చీ పాటను తొలగించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు నగేష్, శివాజీ, యశోధ, గిరిజ పాల్గొన్నారు.

సూర్యాపేటటౌన్: గుంటూరు కారం సినిమాలో విలన్ల పాత్రలకు మార్క్స్, లెనిన్‌ల పేర్లు పెట్టడం సరికాదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ కమ్యునిస్టు విప్లవకారులు, మార్కిస్టుల పేర్లను సినిమాలో విలన్లకు వాడడం సరికాదన్నారు. సినిమాలో అసభ్యకరంగా రాసిన మడతకుర్చీ పాటను తొలగించాలని, పేర్లను తొలగించి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పుల్లూరి సింహాద్రి, మందడి శ్రీధర్, పడిదల మురళి, శశికుమార్, రహీం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు ఎంపిక

సూర్యాపేట అర్బన్, జనవరి 20: రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్ పోటీలకు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నంబర్-2 విద్యార్థులు వై. సాయికృష్ణ, లోకేష్ ఎంపికైనట్లు పాఠశాల గైడ్ టీచర్ అంకతి వెంకన్న తెలిపారు. శనివారం ఆన్‌లైన్‌లో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో ఆటోమెటిక్ సీడింగ్ మిషన్ ప్రయోగం రాష్ట్రస్థాయికి ఎంపికైందని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్లో నార్లు పోయడం, నాట్లు వేసేలా సీడింగ్ మిషన్‌ను ఎంతో ఉపయోగకరంగా ఉండే విధంగా తయారు చేశారని తెలిపారు.

నేడు నియోజకవర్గంలో మంత్రి ఉత్తమ్ పర్యటన

హుజూర్‌నగర్, మఠంపల్లి, జనవరి 20: హుజూర్‌నగర్ నియోజకవర్గంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు మఠంపల్లి మండలం కాలువపల్లి తండాలో గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాల ప్రారంభోత్సవం, 11గంటలకు దొనబండతండాలో గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించనున్నారు. అదేవిధంగా 12 గంటలకు లాలి తండాలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు మేళ్లచెరువు మండలం వేపలమాధవరంలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించనున్నారు. సాయంత్రం 4గంటలకు చింతలపాలెం మండలం రేబల్లెలో గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన, 5గంటలకు చింతలపాలెం మండలం ఎర్రకుంటతండాలో గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవం, సాయంత్రం 6గంటలకు చింతలపాలెం మండలం పులిచింతల ప్రాజెక్ట్ కాలనీలో సీసీరోడ్ల నిర్మాణానికి మంత్రి ఉత్తమ్ శంకుస్థాపన చేయనున్నారు.

వేణు మృతి తీరనిలోటు

నడిగూడెం, జనవరి 20: నడిగూడెం రాజావారి కోటలో నిర్వహిస్తున్న డక్కన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆర్కియాలజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ కన్నెగంటి హిమబిందు భర్త వేణు(53) మృతితీరని లోటని ఏపీ రాష్ట్రం తెనాలి శాసన సభ్యుడు అన్నబత్తుని శివకుమార్ అన్నారు. వేణు గుండెపోటుతో శనివారం మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి సంతాపం తెలిపారు. హిమబిందు శివకుమార్‌కు సోదరి కాగ కుటుంబ సభ్యులతో హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో డాక్రీ అధినేత కుర్ర జితేంద్ర బాబు, జడ్పీటీసీ బానాల కవితనాగరాజు, హరిబాబు ఉన్నారు.

శోభాయమానంగా విజయ సంకల్ప యాత్ర

సూర్యాపేట కల్చరల్, జనవరి 20: అయోధ్యలో ఈ నెల 22వ తేదీన శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతున్న సందర్భంగా జిల్లాకేంద్రంలోని దేవాలయాలు, ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో శనివారం శ్రీరామ విజయ సంకల్ప శోభయాత్ర నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని శ్రీవేదాంత భజన మందిరం వద్ద నుంచి ప్రత్యేకంగా తయారు చేసిన పూల మండప రథవాహనంపై శ్రీరాముని ప్రతిమ విగ్రహాన్ని ఊరేగించారు. శోభా యాత్రను సుధాకర్ పీవీసీ సంస్థ ఎండీ మీలా మహాదేవ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. మహిళలు రథయాత్రకు నీళ్లు అరబోసి శోభాయాత్రకు స్వాగతం పలికారు. పూల సెంటర్ మీదుగా శోభయాత్ర అలంకార్ సెంటర్ నుంచి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం మీదుగా విద్యానగర్, కొత్తబస్టాండ్ వద్ద నుంచి ఎంజీరోడ్డు మీదుగా శంకర్‌విలాస్ సెంటర్ నుంచి సద్దుల చెరువు బతుకమ్మ చౌరస్తాకు చేరుకుంది. కార్యక్రమంలో అయోధ్య శ్రీరామ తీర్థక్షేత్ర ట్రస్టు జిల్లా సంయోజక్ పర్వతం శ్రీధర్, వేదాంత భజన మందిర కమిటీ అధ్యక్షుడు రాచర్ల వెంకటేశ్వర్‌రావు, అర్చకులు దరూరి సింగరాచార్యులు, రాఘవచార్యులు, బ్రాహ్మాండ్లపల్లి మురళీధర్, నూక వెంకటేషం గుప్త, నాగవెల్లి ప్రభాకర్, మహేశ్వరం రవిచంద్ర, ఈగ దయాకర్‌గుప్త, చల్లమల్ల నర్సింహ, పల్స మల్సూర్, పాండురంగాచారి, విజయకుమార్, గట్ల సోమయ్య, దినేష్‌బాబు, కమలాకర్, చంద్రశేఖర్, పబ్బా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్: అయోధ్య శ్రీరామ మందిరం ప్రాణప్రతిష్ఠాపనలో భాగంగా జిల్లా కేంద్రంలోని బేబిమూన్ స్కూల్ విద్యార్థులు శ్రీరామ నామం ఆకారంలో ప్రదర్శనగా నిలిచారు. అనంతరం జై శ్రీరామ్ అంటూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

హుజూర్‌నగర్: మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో శనివారం అయోధ్య రామాలయం అక్షింతల ఊరేగింపు నిర్వహించారు. భక్తులు గ్రామంలో పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రాతఃకాల పూజలు చేసి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అద్దంకి సైదేశ్వరరావు, అర్చకులు దామోదరాచార్యులు, నాగేశ్వరరావు, సీతారామయ్య, వెంకటేశ్వరరావు, వెంగళ్‌రావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో శోభాయాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

అర్వపల్లి: అయోధ్య రాములవారి అంక్షితలను అర్వపల్లిలో ఇంటింటికీ వితరణ చేశారు. బీజేపీ తుంగతుర్తి నియోజక వర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్య అంగరంగ వైభవంగా బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. దేశంలోని అనేక రాష్ట్రాలు సెలవులు ప్రకటించారన్నారు. కార్యక్రమంలో జిన్న అశ్విని, లింగంపల్లి వేణు, మోరపాక వినేష్, క్రాంతి, పార్థు, వంశీ, లింగంపల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో కోలాటం ఆడుతున్న మహిళా భక్తులు



సూర్యాపేట పట్టణంలో రామనామం ఆకారంలో విద్యార్థులు



హుజూర్‌నగర్: సీతారాంపురంలో అయోధ్య అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐపీఎస్ సరిత



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐపీఎస్ సరిత

కోదాడ, జనవరి 20: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఏపీ మహిళా సంరక్షణ సీఐడీ అధికారి, ఐపీఎస్ సరిత అన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన న్యూ విజన్ పాఠశాల ప్రథమ వార్షికోత్సవంలో ఆమె మాట్లాడారు. చిన్నారులకు బాల్యంలో నేర్పిన ఆటా, పాట విద్య భవిష్యత్ నిర్మాణానికి బీజం వేస్తుందన్నారు. బాల్యం, అమూల్యం, అనిర్వచనీయమన్నారు. బాల్యంలోనే భవిషత్ నిర్మాణానికి అంకురార్పణ జరుగుతుందన్నారు. పాఠశాల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ స్థాయి విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్య అందించాలనే ఉద్దేశంతోనే పాఠశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిష్ణాతులైన అధ్యాపకులతో చక్కని బోధనతో పాటు ప్రోత్సాహాన్ని అందిస్తూ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీట్ అడ్వాన్స్‌డ్ పోటీ పరీక్షల్లో విద్యార్థులు రాణించే విధంగా పునాది వేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చేపట్టిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సీహెచ్ కార్తీక్, కె. శ్రీదేవి, సీహెచ్ గోపిచంద్, ఎంఈఈ సలీంషరీఫ్ పాల్గొన్నారు.

సమష్టి బాధ్యతతోనే ప్రమాదాల నివారణ

కోదాడ రూరల్, జనవరి 20: సమష్టి బాధ్యతతోనే ప్రమాదాలు నివారించొచ్చని, రహదారి భద్రత అందరి బాధ్యత అని హైదరాబాద్ ఆర్టీవో రాచకొండ బాబు అన్నారు. 'ముందుగా బయలుదేరు.. క్షేమంగా గమ్యం చేరు' అనే నినాదంతో ఈ ఏడాది చేపట్టిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఆర్టీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపొద్దని సూచించారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, ఓవర్‌టేక్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 14వ తేదీ వరకు కొనసాగనున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో విద్యార్థులు, డ్రైవర్లు, విద్యాసంస్థల ప్రతినిధులు, ఇతర అన్నివర్గాలకు చెందిన వాహనదారుల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం కానిస్టేబుళ్లు, విద్యార్థులు, డ్రైవర్లు, వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు.



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న హైదరాబాద్ ఆర్టీవో బాబు

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

పెన్‌పహాడ్, జనవరి 20: గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు రూపొందించాలని జడ్పీ సీఈవో జి. సురేష్ అన్నారు. మండల అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. గ్రామసభల ద్వారా ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనుల జాబితా రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ మహేందర్ రెడ్డి, ఎంపీవో నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి: గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సుయాదవ్, పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. అర్వపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల సమగ్రాభివృద్ధి నివేదికపై పంచాయతీ కార్యదర్శులతో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు సమస్యలను నివేదికలను తయారు చేయాలన్నారు. వేసవి సమీపిస్తున్నందున మంచి నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. మురుగు కాల్వలను శుభ్రం చేయించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి రామారావునాయక్, ఎంపీవో సందీప్ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: గ్రామాల్లో ప్రజలకు నీటి వసతులు కల్పించాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాసు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. మండలంలో నెలకొన్న పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. తీర్మానం చేసిన పనులకే ప్రాధాన్యం ఉంటుందన్నారు. అధికారులు ఖచ్చితంగా ప్రొటోకాల్ పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లావణ్య, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, శైలజ, స్వర్ణ, సాయిరామ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, కపిల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్‌లో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో సురేష్



మునగాల రూరల్: మండలకేంద్రంలో రైతులు సాగు చేసిన వరిపొలాలను కోదాడ సహాయ వ్యవసాయ సంచాలకులు టి.వాసు పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతిని గమనించినట్లు తెలిపారు. నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. అలాగే జింక్ లోప నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, యూరియా వాడకంపై రైతులకు సూచనలు చేశారు. యూరియా ఎక్కువగా వాడడం వలన పురుగులు, తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో బి.అనిల్‌కుమార్, ఏఈవోలు ఉప్పయ్య, ముస్తఫా, నాగు పాల్గొన్నారు.

తుంగతుర్తి: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై అధ్యయనం కోసం కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవగౌబా నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించడం పట్ల బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణపై హైదరాబాద్‌లో ఇచ్చిన హామీ మేరకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నాగారం: అయోధ్యలో ఈ నెల 22వ తేదీన రామ మందిర ప్రారంభిస్తున్నందున భక్తులు శ్రీరాముడి పూజ కార్యక్రమంలో నిమగ్నమై ఉంటారని ఆ రోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య కోరారు.

సూర్యాపేట అర్బన్: పదో తరగతి పరీక్షలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీ శైలజ, పద్మ, వెంకన్న, శ్రీనివాస్, యల్లారెడ్డి, ఉమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

తిరుమలగిరి రూరల్: మండలంలోని తొండ గ్రామ ఎంపీపీఎస్ ఎస్సీ కాలనీ పాఠశాలలో ఆరోగ్య విద్యలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రీయ బాల స్వస్త్ కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కె) బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు సరళ, మమత మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ స్నానం చేసి పరిశుభ్రమైన దుస్తులు ధరించి పాఠశాలకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శాంతయ్య, ప్రధానోపాధ్యాయులు అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు మురళి, మల్లిఖార్జున్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పేదలకు రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని డీఆర్‌ఎస్ ట్రస్ట్ అధ్యక్షుడు దగ్గుపాటి బాబూరావు కోరారు. శనివారం రోగికి రక్తదానం చేశారు. రోగులకు, ప్రమాదంలో గాయపడిన వారికి రక్తదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో ముల్కలపల్లి రాంబాబు, దగడ గోపి, మార్క్స్ శ్రీనివాస్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పాలకవీడు: భవానీపూరంలోని డెక్కన్ సిమెంట్ కర్మాగారం ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని సంస్థ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు, సీజీఎం నాగమల్లేశ్వరావు ప్రారంభించారు. మండలంలో సుమారు 950మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, మౌనిక, విశాల్, గంగరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: తెలంగాణ బంజార ఎంప్లాయిస్ సేవ సంఘ్ (టీబీఈఎస్ఎస్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్లను జడ్పీ సీఈవో సురేష్ ఆవిష్కరించారు. గిరిజనుల సంక్షేమ కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని జడ్పీ సీఈవో అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంఈవో రవి, ఏపీపీ రవి, ఆ సంఘం మండల కార్యదర్శి వర్గ సభ్యులు పీఆర్ఏఈ గోపి, ఏవో కృష్ణ సందీప్, ఏపీఎం అజయ్ నాయక్, ఈవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్దిరాల: ఎంపీ ఎన్నికల కోసం నిర్వహించే పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ అమీన్‌సింగ్ పరిశీలించారు. మండల పరిధిలోని రెడ్డిగూడెం, మద్దిరాల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. 18ఏళ్ల యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామారావు, ఆర్ఐ వహిదోద్దీన్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నాగారంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

నాగారం జనవరి 20: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య కోరారు. భారత్ వికసిత్ యాత్ర మొబైల్ ప్రచార రథం శనివారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసం జనధన్ యోజన జీరో ఖాతాలు, ఉజ్వల గ్యాస్ కనెక్షన్, చిరు వ్యాపారుల కోసం ముద్ర రుణాలు, చేతి వృత్తుల కోసం విశ్వకర్మ యోజన పథకాలను ప్రధాని మోదీ ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ అనంత్ గుప్తా, బీజేపీ నాయకులు దండ శ్రీనివాస్, మంగదుడ్ల రమేష్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: భారత్ వికాస సంకల్ప యాత్రతో మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నట్లు హెచ్ఈవో చంద్రశేఖర రాజు అన్నారు. మండల పరిధిలోని అనంతారం, నాగులపాటి అన్నారం గ్రామాల్లో నిర్వహించిన భారత్ వికాస సంకల్ప యాత్రలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. హాజరైన ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు పూజ, హరికృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మీ, ఏఎన్ఎం సుభద్ర, హెల్త్ అసిస్టెంటు మధు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి



మంత్రి ఉత్తమ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యదర్శులు

హుజూర్‌నగర్, జనవరి 20: గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్యదర్శులు హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం మంత్రికి వినతిపత్రం అందజేశారు. న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న శాస్త్రవేత్త కిరణ్

గరిడేపల్లి, జనవరి 20: గడ్డిపల్లి కేవీకే మృత్తిక శాస్త్రవేత్త ఏ. కిరణ్‌కు ఏరువాక ఫౌండేషన్ అవార్డు అందజేసింది. హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ మల్లారెడ్డి యూనివర్సిటీలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఏరువాక ఫౌండేషన్ ఫౌండర్ గారా రాఘవరావు, పద్మశ్రీ చింతల వెంకటరెడ్డి నుంచి ఆయన అవార్డు అందుకున్నారు. వ్యవసాయ రంగంలోని కృషి, రైతులను సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై రైతులను చైతన్యం చేసినందుకు అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీఎస్‌కే రెడ్డి వైస్ చాన్సలర్ మల్లారెడ్డి యూనివర్శిటీ, డాక్టర్ ఏ.రాజారెడ్డి డీన్, సీహెచ్. సుధాకర్‌రావు, సూర్యకళ, శ్రీనివాసరావు, పి.గణేషం, సృజన తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎంపికైన బొబ్బ భాగ్యరెడ్డిని నేరేడుచర్ల బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాల వెంకటేశ్వర్లు, గుండెబోయిన వీరబాబు, నరేష్, విజయ్, సత్యనారాయణరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, అంజయ్య, రవి, లింగరాజు, శ్రీను, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల: మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన నాగెల్లి ఉపేందర్ భార్య శృతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఉపేందర్‌తో పాటు పదో తరగతి చదివిన స్నేహితులు కుటుంబ సభ్యులకు రూ.12వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బెడద రవి, బరపటి రవీందర్, వెలుగు సైదులు, కొమ్ము మల్లయ్య, హరికృష్ణ, కవిత, రమేష్, సుధాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మునగాల రూరల్: రైతులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వేమూరి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. యాసంగి పనులు మొదలై రోజులు గడుస్తున్న తరుణంలో కొందరు రైతులు పెట్టుబడి సాయం కిద ఇస్తానన్న రైతుబంధు పథకం ఇంకా అమలు కాలేదని అడిగిన నేపథ్యంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

నడిగూడెం: మండలంలోని రత్నవరంలో కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి పీఎస్‌పీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్ పగడాల పద్మప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. లేబర్ కార్డు ఉన్నవారికి 52రకాల ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పగడాల భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, నర్సింహ్మారావు, గోపి, వెంకన్న, సంస్థ కో ఆర్డినేటర్ చల్లా తారక్, రాకేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

